క్లుప్తంగా

బీహెచ్ఆర్సీ సలహాదారుగా సూరిబాబు


రెడ్డి సూరిబాబు

సంతబొమ్మాళి: భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా సలహాదారునిగా మండలానికి చెందిన రెడ్డి సూరిబాబు నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఆ సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ పుమా చంద్రసాహూ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ.. మానవహక్కులు కాపాడటానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

సంతబొమ్మాళి: కాకరాపల్లి గ్రామానికి చెందిన ఐదో తరగతి విద్యార్థి ఎం.అజయ్‌కుమార్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్లి జగన్నాయకులు రూ. ఐదు వేలు, ఎంపీపీ మేరుగు రాజేశ్వరి, ఉమిలాడ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రూ. 17 వేలు సమకూర్చారు. ఈ మొత్తాన్ని విద్యార్థి తండ్రి సింహాచలానికి ఆస్పత్రికి వెళ్లి అందజేశారు. ఈ పార్టీ నాయకులు మేరుగు అప్పారావు తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా కార్తీక వన భోజనాలు


ఉసిరిక చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

కంచిలి: మండల కేంద్రం కంచిలి పట్టణ కళింగ కోమటి సంఘం ఆధ్వర్యంలో మకరాంపురం గ్రామంలోని కాళికాదేవ ఆలయం వద్ద కార్తీక నవమి సందర్భంగా ఆదివారం నిర్వహించిన వనభోజనాలు ఉత్సాహంగా సాగాయి. ఆలయం ఆవరణలోని ఉసిరి చెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే కళింగ కోమట్ల ఆరాధ్య దైవం కన్యకాపరమేశ్వరి దేవి చిత్రపటానికి భక్తిశ్రద్ధలతో పూజించారు.

ఆకట్టుకున్న పగటి వేషాలు


యువతుల కోలాట ప్రదర్శన

వజ్రపుకొత్తూరు రూరల్: పెద్దబొడ్డపాడు పంచాయతీ పరిధి సీతాపురంలో నందెమ్మ సంబరాలు ఆదివారం సందడిగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు వేసిన పగటి వేషాలు ఆకట్టుకున్నాయి. యువతుల కోలాటం, జాలరీ అమ్మవారు, కొయడాన్స్‌తో పాటు పౌరాణిక వేషాలతో అలరించారు. వీటిని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపారు.

కొండచిలువ కలకలం


స్థానికుల చేతిలో హతమైన కొండచిలువ

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 15వ వార్డు పరిధి దానంపేటలో సుమారు తొమ్మిది అడుగుల కొండచిలువ ఆదివారం వేకువజామున కలకలం సృష్టించింది. గ్రామంలోని బావి వద్దకు స్థానికులు స్నానాలకు వెళ్తుండగా కొండచిలువ కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. స్థానికులు కొంతమంది ధైర్యం చేసి దాన్ని సమీపంలోని పొలాల్లోకి పంపించే ప్రయత్నం చేసినప్పటికీ కుదరకపోవడంతో కర్రలతో కొట్టి హతమార్చారు.

అటవీ సిబ్బంది నివాళులు


అమరులకు నివాళులర్పిస్తున్న రేంజర్ మురళీకృష్ణ

కాశీబుగ్గ: కాశీబుగ్గ ఫారెస్ట్ కార్యాలయంలో అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని అధికారులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో మృతి చెందిన ఉద్యోగులను స్మరించుకొని నివాళులర్పించారు. తొలుత అటవీరేంజ్ అధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ చేపట్టారు.



ఆ..కూడలంటే భయం..

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మూడు రోడ్ల కూడలి ముఖ్యమైనది. ఇక్కడ నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తుండడంతో వాహనాదులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. కాశీబుగ్గ బస్టాండ్‌కు రాకపోకలు చేసే బస్సులు, టోల్ గేటు తప్పించుకునేందుకు వచ్చే భారీ కంటైనర్‌లు, లారీలు, స్థానిక వాహనాలు, ద్విచ క్రవాహనాలతో నిత్యం ఇక్కడ ట్రాఫిక స్తంభిస్తుంది. పక్కనే ఉన్న రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుంది. – కాశీబుగ్గ

అఖండ భజన..

పలాస మండలం రామక్రిష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో ఇరవై నాలుగు గంటల అఖండ భజన కార్యక్రమం వైభవంగా జరిగింది. శనివారం సాయంత్రం ఆరుకు ప్రారంభమైన భజన ఆదివారం సాయంత్రం ఆరుగంటల వరకు నిరంతరాయంగా కొనసాగింది. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో అధికసంఖ్యలో సాయిభక్తులు పాల్గొన్నారు. – కాశీబుగ్గ





పూర్వ విద్యార్థుల ఔదార్యం

వజ్రపుకొత్తూరు మండలం పాతటెక్కలి ఉన్నత పాఠశాలలో 1993–94 విద్యాసంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు తోటి విద్యార్థికి అండగా నిలిచారు. దున్న భాగ్యలక్ష్మి భర్త చినబాబు అనారోగ్యంతో చనిపోయారు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు అంతా కలిసి రూ. 50 వేలు సేకరించారు. ఆదివారం భాగ్యలక్ష్మిని పరామర్శించి ఈ మొత్తాన్ని ఆమెకు అందజేశారు. పూర్వ విద్యార్థులు బాలకగిరి, రమణయ్య, అట్టాడ కవిత, భారతి, జగదాంబ, దయవతి ఉన్నారు. – వజ్రపుకొత్తూరు

అపూర్వ కలయిక..

కవిటి మండలం రాజపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1999–2004 మధ్యకాలంలో చదువుకున్న పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. ఆటపాటలతో సందడి చేశారు. చదువుకున్న రోజులను గుర్తుకు చేసుకొని సందడిగా గడిపారు. ఇందులో భాగంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులకు పాదపూజ చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. తమ ఎదుగుదలకు కారణమైన వారిని దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. – కవిటి



మంత్రి ఇలాకాలో..
మూత దిశగా జూనియర్ కాలేజీ!

- నందిగాం కళాశాలలో సాగని చదువులు
- పట్టించుకోని నాయకులు, ఉన్నతాధికారులు


నందిగాం ప్రభుత్వ జూనియర్ కాలేజీ


నాడు-నేడు పథకంలో సమకూర్చిన బెంచీలు

నందిగాం: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇలాకాలో ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సువిశాలమైన నందిగాం మండలానికి జూనియర్ కాలేజీ మంజూరైనప్పటికీ విద్యార్థులకు సరైన న్యాయం జరగడం లేదు. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన కాలేజీ నేడు మూతదిశగా అడుగులు వేస్తుంది. 2018–19 విద్యా సంవత్సరంలో అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నందిగాంకు జూనియర్ కాలేజీని ఫైనాన్షియల్ శాంక్షన్ లేకుండా, నాన్ శాంక్షన్ కాలేజీగా ఆదరా బాదారగా మాంజూరు చేయించి ప్రారంభించారు. కాలేజీకు అవసరమైన భవనాలు, మైదానం, మౌలిక వసతులు, ఆధ్యాపకుల కోసం కనీసం ఆలోచించకుండా తన హయాంలో వచ్చింది అనిపించు కోవడం కోసం స్థానిక ఉన్నత పాఠశాల భవనాల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ గ్రూపులతో అరంభించారు. ఆయా గ్రూపు సబ్జెక్టులను బోధించే సిబ్బంది, ప్రిన్సిపాల్ నియామకంపై దృష్టి సారించకుండా పక్క కాలేజీల్లో పని చేస్తున్న లెక్చరర్లలో ఒకరిని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా, మిగతా అన్ని సబ్జెక్టులకు రూ. 10 వేల జీతంతో గెస్ట్ లెక్చరర్లను నియమించి తరగతులు కొనసాగించారు. ఇక్కడ పనిచేసే ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు అంకిభావం లేకపోవడం, కళాశాల అభివృద్ధిపై దృష్టి పెట్టకపోవడంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందనంగా తయారైంది. ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఆరుగురు ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లు మారడం, గెస్ట్ లెక్చరర్లపైనే ఆధార పడి కాలేజీ నడపడంతో విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపించింది. చదువులు గాడి తప్పే పరిస్థితి దాపురించింది. రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేకపోవడమో, బోధనా వైఫల్యమో, ఉన్నతాధికారుల నిర్లక్ష్యమోగాని ఉత్తీర్ణతా శాతం తగ్గతూ వస్తుంది. గత ఏడాది కేవలం 45 శాతం ఉత్తీర్ణత నమోదైంది. విద్యార్థుల చేరికలు సైతం తగ్గుతున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ఎంపీసీలో నలుగురు, బైపీసీలో 18, హెచ్ఈసీలో 17 మంది మాత్రమే చేరడం ఈ కాలేజీ దుస్థితికి నిదర్శనం. ఈ ఏడాది తరగతులు ప్రారంభమైనప్పటికీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. అతని స్థానంలో మరొకరిని ఇప్పటికీ నియమించలేదు. ఇక్కడ ఉన్న ఒక కాంట్రాక్ట్ లెక్చరర్‌కు మౌలిక ఆదేశాలతో కళాశాలను నడపమని సూచించి ఉన్నతాధికారులు చేతులు దులుపుకున్నారు. దీంతో కళాశాలలో ఏదైనా సమాచారం కావాలంటే అధికారికంగా చెప్పే వారు లేరు. గత ప్రభుత్వంలో నాడు-నేడు పథకంలో భాగంగా మంచినీటి బోరు, టాయిలెట్స్, బెంచీలు, ఫ్యాన్లు వంటివి మౌలిక సదుపాయాలు సమకూరాయి. రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవడం లోటుగా ఉంది. ప్రస్తుతం ఒక కాంట్రాక్ట్, మిగతా గెస్ట్ లెక్చరర్లు ఉన్నారు. టెక్కలి నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రస్తుతం మంత్రిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు పరిధిలో ఉన్న ఈ కాలేజీపై ఆయన దృష్టి పెట్టిన దాఖలాలు లేదు. దీంతో ఆర్భాటంగా ప్రారంభించిన కాలేజీ మూతపడే దిశగా అడుగులు వేస్తుంది. ఇప్పటికైనా ఆయన శ్రద్ధచూపించి కాలేజీ అభివృద్ధిపై దృష్టిసారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థుల చేరికలు ఇలా..

2018-19	64
2019-20	100
2020-21	100
2021-22	106
2022-23	44
2023-24	58
2024-25	39

రెగ్యులర్ అధ్యాపకులను నియమించరు..



నందిగాంలో ఉన్నది నాన్ శాంక్షన్డ్ జూనియర్ కాలేజీ. ఇలాంటి కాలేజీల్లో రెగ్యులర్ అధ్యాపకులను నియమించడం జరగదు. వేరే కాలేజీల్లో ఉన్న సర్‌ప్లస్ లెక్చరర్లతో పాఠాలు చెప్పించడం, గెస్టు లెక్చరర్లతో తరగతులు నిర్వహించడం జరుగుతుంది. వేరే కాలేజీలో పనిచేసే ప్రిన్సిపాల్, నాన్ టీచింగ్ స్టాఫ్ ఆన్ డ్యూటీ బేస్‌లో జీతం తీసుకుంటూ ఇలాంటి కాలేజీల్లో పనిచేస్తుంటారు. ఇలాంటి కాలేజీల్లో 50 శాతం సీనియర్ ఆధ్యాపకులను నియామకం చేసేలా నిర్ణయం తీసుకోవడం జరిగింది. కొద్ది రోజుల్లో కొత్తవారు చేరుతారు.

– శివ్వాల తవిటినాయుడు, డీవీఈవో, శ్రీకాకుళం

మృతుల కుటుంబాలకు పరామర్శ


దేవరాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


కోటబొమ్మాళి: వెంకటరమణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు


ఇచ్ఛాపురం రూరల్: సుప్రియ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కంచిలి: మండలంలోని ముండ్ల గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు భగవాన్ ప్రధాన్ మనవడు దివ్యాంస్ ప్రధాన్ బస్సు చక్రాల కింద పడి ఇటీవల మృతి చెందాడు. అలాగే ఇచ్ఛాపురం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కాళ్ల దేవరాజు అనారోగ్యంతో చనిపోయారు. ఈ రెండు కుటుంబాలను స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, నాయకులు లడ్డు కేశ్వర పాత్రో, దుర్గాసి ధర్మారావు, ముండ్ల గ్రామ సర్పంచ్ రామచంద్ర ప్రధాన్, సుశాంత్ ప్రధాన్ ఉన్నారు.

కోటబొమ్మాళి: కోటబొమ్మాళికి చెందిన సీనియర్ జర్నలిస్టు తలగాపు వెంకటరమణ భార్య ఝాన్సీ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వెంకటరమణను ఆదివారం పరామర్శించి ఓదార్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రోణంకి మల్లయ్య, రాంపాత్రుని శివారెడ్డి, పేడాడ వెంకటరావు, డాక్టర్ బలగ మురళీ ఉన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: మండల ఉపాధ్యక్షుడు దువ్వ వివేకానందరెడ్డి మరదలు సుప్రియ కిడ్నీ వ్యాధితో ఈదుపురంలో చనిపోయారు. అలాగే ఇచ్ఛాపురం పట్టణ వైఎస్సార్‌సీపీ మాజీ అధ్యక్షుడు కాళ్ల దేవరాజు అనారోగ్యంతో కాలం చేశారు. ఈ రెండు కుటుంబ సభ్యులను ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, సర్పంచ్ కారంగి త్రినాథ్ రెడ్డి, రంగాల కృష్ణారెడ్డిలు పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు.

హైందవ శంఖారావ సభను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఫాల్గుణరావు

సోంపేట: హిందూ ధర్మం, దేవాలయాల పరిరక్షణ కోసం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి ఐదో తేదీన విజయవాడలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావ బహిరంగ సభను విజయవంతం చేయాలని వీహెచ్‌పీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోంపేట శాఖ ఆధ్వర్యంలో స్థానిక కళింగ వైశ్య సంఘ భవనంలో ప్రత్యేక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న వీహెచ్‌పీ ఆంధ్రప్రాంత మఠ మందిర ప్రముఖ్ ఫాల్గుణరావు మాట్లాడుతూ హిందూ దేవాలయాల పరిక్షణ జరగాలంటే హిందువులు ఆధ్వర్యంలో దేవాలయాల నిర్వహణ ఉండాలన్నారు. హిందూ ఇతరులను దేవాలయాల బాధ్యత నుంచి తొలగించాలన్నారు. సంఘ ప్రతినిధులు కర్రి లింగరాజు, రంగోయి హేమంత్, కర్రి గిరిబాబు, కొంచాడ వేణుగోపాలరావు, తెప్పల కృష్ణారావు, అలేటి విజయరావు, సోంపేట, కంచిలి మండలాల నుంచి పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు మార్చాలని ఆందోళన


శిథిలమైన స్తంభం వద్ద దిబ్బవానిపేట మహిళలు

వజ్రపుకొత్తూరు: శిథిలమైన విద్యుత్ స్తంభాలను మార్పు చేయాలని కొత్తపేట పంచాయతీ దిబ్బవానిపేట గ్రామస్తులు కోరారు. శిథిలమై కూలిపోయే పరిస్థితిలో కొన్ని స్తంభాలు ఉండడంతో కూలిపోయే ప్రమాదం ఉందంటూ ఆదివారం ఆందోళనకు దిగారు. వజ్రపుకొత్తూరు విద్యుత్ శాఖ ఏఈఈ దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పటికీ స్పందించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు


ఈదుపురం కూడలిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న పోలీసులు


కొఠారీలో ప్రజలను అప్రమత్తం చేస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

ఇచ్ఛాపురం రూరల్: వాహనాలపై ప్రయాణిస్తున్న సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్ అన్నారు. ప్రధాన రహదారి కూడళ్లలో ప్రమాద హెచ్చరిక బోర్డులను ఆదివారం ఏర్పాటు చేశారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు విధిగా పాటించాలని పోలీసులు కోరారు.

మహిళలు జాగ్రత్తగా ఉండాలి

ఒంటరిగా బయటకు వెళ్లే సమయంలో మహిళలు జాగ్రత్తగా ఉండాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం కొఠారీ పంచాయతీలో ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చైన్ స్నాచింగ్‌లు జరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, క్యాంపులకు వెళ్లే సమయంలో ఇంటి తలుపులకు తాళాలు వేసి పక్కంటి వారిని అప్రమత్తం చేయాలని, ద్విచక్ర వాహనాలపై వెళ్లే సమయంలో తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సమావేశంలో సర్పంచ్ దుక్క ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ఆనందం



సత్సంగంలో వీహెచ్‌పీ ప్రతినిధులు

టెక్కలి: ఆధ్యాత్మికతతో మానసిక ఆనందం కలుగుతుందని విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు బి.శేషగిరి, జి.చంద్రశేఖర్ అన్నారు. జయకృష్ణాపురం గ్రామంలో ఆధ్యాత్మిక సత్సంగం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా గీతా పారాయణం, హిందూ సంప్రదాయం, ఆలయాల విశిష్టత తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలపై సత్సంగం చేశారు. కార్యక్రమంలో టి.ఆనందరావు, నరసింహస్వామి, రామకృష్ణ, రమణ, ఎస్.కరుణ్‌కుమార్, బి.సోమేశ్వరరావు, ఎస్.పాపారావు పాల్గొన్నారు.

నేటి నుంచి బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆధార్ సేవలు

సాక్షి ఎఫెక్ట్...

టెక్కలి: టెక్కలి బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సోమవారం నుంచి ఆధార్ సేవలు యధాతథంగా కొనసాగుతాయని నిర్వాహకులు వెల్లడించారు. 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన 'అపార్‌కు ఆధార్ అడ్డంకులు' కథనంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో నిలిచిన ఆధార్ సేవలపై ప్రస్తావించిన సంగతి తెలిసిందే. దీంతో సంబంధిత అధికారులు స్పందించి సేవలను పునరుద్ధరించే చర్యలు చేపట్టారు. దీంతో సోమవారం నుంచి ఆధార్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి

ఇచ్ఛాపురం: మద్యాన్ని ఎమ్మార్పీకే విక్రయించాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. నిబంధనకు విరుద్ధంగా మద్యం విక్రయించే దుకాణదారులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎవరైనా బెల్టు షాపులకు మద్యం తరలిస్తే సహించేదిలేదన్నారు. ఇప్పటి వరకూ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఏడు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

గోసంరక్షణ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


గోసంరక్షణ పోస్టర్ ఆవిష్కరణలో రామానందస్వామి, అయ్యప్పస్వాములు

కాశీబుగ్గ: గోవులను రక్షించుకుంటే దేశాన్ని రక్షించుకున్నట్లేనని కాశీబుగ్గ అమ్మ ఆశ్రమం, దత్త అయ్యప్పస్వామి దేవాలయం వ్యవస్థాపకులు రామానందస్వామి అన్నారు. గోసంరక్షణ వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాలలో లక్షల మంది ప్రజలు నివాసం ఉంటే వందల సంఖ్యలో ఆవులు, గేదెలు ఉండగా.. కావాల్సిన పాలు ఎక్కడినుంచి వస్తున్నాయో అర్థం చేసుకోవాలని అన్నారు. ఉన్నపలంగా ప్యాకెట్‌ల రూపంలో ఎంతకావాలంటే అంత పాలు, పెరుగు అందించగలుగుతున్నారంటే అనుమానించాలని అవసరం ఉందన్నారు. రసాయన పాలను వినియోగించి అనారోగ్యానికి గురికావద్దన్నారు. ఇంటివద్ద ఆవును పెంచుకుంటే పాలు, పెరుగు, మజ్జిగ, వెన్న, నెయ్యి, వ్యవసాయ ఎరువు సంపాదించుపెడుతుందని అన్నారు. గురుస్వామి పార్వతీశం మాట్లాడుతూ.. ఈనెల 13న దత్తఅయ్యప్ప ఆలయం వద్ద వనభోజన కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొండే నరసింహస్వామి, అధికసంఖ్యలో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

రూ.40 వేల ఆర్థిక సాయం


ఆర్థికసాయాన్ని అందేస్తున్న తోటి కార్మికులు

కాశీబుగ్గ: తమతో పాటు పనిచేసిన కార్మికుడు మరణించడంతో అతని కుటుంబానికి కొంత ఆర్థిక చేసి ఆదుకున్నారు మిగిలిన కార్మికులు. వివరాల్లోకి వెళితే.. మజ్జి కూర్మారావు అనే భవన నిర్మాణ కార్మికుడు అనారోగ్యతో మరణించారు. దీంతో అంబుగాం గ్రామంలోని నవోదయ భవన నిర్మాణ కార్మిక సంఘం రూ. 40 వేలు సేకరించింది. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి ఆదివారం అందజేసి అండగా నిలిచారు. నవోదయ భవన్ నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు బల్ల మాధవరావు, ప్రగతి శీల కార్మిక సంఘం జిల్లా కోశాధికారి దేవాడ నారాయణరావు, మామిడి గోపాలు, మధ్య శివకేశ్వరరావు, దేవాడ యామరాజు, మజ్జి విశ్వనాథం, తోట గోపాలు పాల్గొన్నారు.